# విజ్ఞప్తి

స్వాతంత్ర్య స్వర్ణ జయంతి సందర్భముగా, దిగువ తోక ముద్రలు వేసిన పంతొమ్మిది గేదెలు, రెండు దున్నపోతులు, దేశమునందలి అసంఖ్యాక మూగజీవముల తరపున పౌరులకు చేయు విజ్ఞప్తి. ఈ దిగువ వివరించిన కారణముల వలన ఈ విన్నపము ఎవరికి, ఎటుల జేయవలెనో అర్థము గాక ఇటుల మొదలు పెడితిమి.

మేము మా భాషలో మా గోడు వినిపించగా, శ్రీ తోలేటి జగన్మోహనరావు అను లేఖకులు మానవ భాషలోనికి అనువదించడమైనది. తప్పొప్పులకు, సారాంశములోని వాస్తవ, అవాస్తవములకు, తోకముద్రదారులేగాని, అనువాదకుడు బాధ్యుడు గాడని స్పష్టబరచుచూ, లేఖకులు శ్రీ జగన్మోహనరావుగారిని ఈ విజ్ఞప్తి వలన ఉత్పత్తికాగల వాద వివాదముల నుంచి విడుదల చేయుచున్నాము.

ఇంద్రప్రస్థ నగరములో రాజసేవలో యున్న శ్రీ తోలేటి జగన్మోహనరావు, విహార యాత్ర నెపమున పాటలీపుత్రము జేరి నొక దినమున గంగానది యొడ్డున పవ్వళించి, '..హోఠోంపే నచాయీ రహితీ హై....జిస్ దేశ్మే గంగా బహతీ హై....' అని ఎలుగెత్తి కర్ణకఠోరముగా పాడుచుండ నా సమీపమున జలకాలాడుచున్న మేము, 'ఎవ్వడీ బుద్ధి హీనుడు? గంగానది ప్రవహించు దేశమున సత్యము నిరతము వెలుగుచుండునని నిస్సిగ్గుగా ఇంత యసత్యము పలుకుచున్నాడు....' అని మాలో మేము మాటలాడుకొనుచుండ, ఆయన విని ఆగ్రహము చెంది, ' ఓ మహిషములారా! మీ భాష నాకు తెలియదనుకుని నోటికి వచ్చినట్లు వదరుచున్నారా?' అని రాయి విసరగా, అది దీర్ఘశృంగుడను దున్నపోతునకు

తగిలెను. మేము ఆగ్రహించి కొమ్ములతో కుమ్మివేయుటకుద్యమింప, ఆయన భయముతో లేచి పరుగెత్తసాగెను.

దీర్ఘ శృంగుడు మమ్ములను వారించి, 'వీనికి పూర్వ జన్మ సంస్కారము బోక మన భాషను అర్థము చేసుకొన గలవాడైయున్నాడు. ఈ మూర్ఖుని వలన మనకు కాగల కార్యమొండుయున్నది. వీనిని ఇప్పుడే బొడువరాదు' అని శ్రీ జగన్మోహనరావుతో, 'మిత్రమా! మా వలన నీకు ఏ హానియు జరుగదు. నీవలన మాకు జరుగవలసిన యుపకారమొకటియున్నది యనగా ఆయన 'మీరు మహాబలశాలురు, మీకు నేనేమి సహాయము జేయగలను' అని గడ గడ వణుకుచు అంటిరి.

'అన్నా! మా తరపున నీవు ఒక విన్నపము రాసి పెట్టవలె' అని దీర్ఘ శృంగుడు చెప్పగా, తన యవసరము మాకు నిజముగా గలదని తెలిసిన వెంటనే, ఆశ్చర్యకరముగా ఊసరవిల్లి రంగు మార్చినట్లు ఆయన రంగు మార్చిరి. భీరుత్వము పోయి, రాజసేవకులకు సహజముగ నుండు దర్పాతిశయముతో, 'మీకు విజ్ఞప్తి రాసి పెట్టినచో నాకేమి లాభము?' అని కాలుమీద కాలువేసుకుని, అర్థించుచున్న మా వెంపు జూడక ఎటువైపో జూచుచు, నిర్లక్ష్యముగా అడిగిరి.

దీర్ఘశృంగుడు నిట్టూర్చి, 'ఆహా! అల్పుని అవసరార్థము ఆశ్రయించినచో కన్నూ మిన్నూ గానడు. రాజోద్యోగము ఎటువంటివాని చూపునైనను వక్రబరచును. లంచమివ్వనిచో మంచమైనను ఎక్కని రాజోద్యోగి, స్వలాభము లేక ఊరికి రవంత ఉపకారము చేయనిచ్చగించడుకదా యని చింతించి, 'నేస్తమా! ఎండిన పొదుగుల క్షీరము లేదు. పేడ తప్ప నీకు మరియే కానుకలివ్వగలము?' అని దిగులుగా అనెను.

'ఛీ...నన్ను పిడకలుచేసి అమ్ముకొనమందురా? అయినను, ప్రభుత్వము విదేశముల నుండి పేడ దిగుమతి చేయ సంకల్పించుచుండ, స్వదేశీ పేడ ఎవరికి కావలెను? పొండు!' అని ఈసడించిరి.

ఇక్కడ కోట్ల పశువుల పేడ యుండగా, విదేశీ పేడ ఎందులకు అని ఆశ్చర్యపోయి ప్రశ్నించితిమి.

'మంద బుద్ధులారా! విదేశీ పేడ దిగుమతిజేయనివ్వనిచో విదేశీ పెట్టుబడులు భారతదేశమునకు వచ్చుటెట్లు? దేశము పురోగమించుటెట్లు? మీకు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక విధానములు అర్థముగావు. గడ్డి మేయుట తప్ప ఆర్థిక సంస్కరణల గురించి మీకేమి తెలియును?' యని మహాజ్ఞాని వలె మమ్ములను హీనబరుచుచు మాటలాడ, మా యజ్ఞానమునంగీకరించుచూ, 'అన్నా! ఆ గ్రాసము కుంభకోణమే నీ ద్వారా నలుగురికి విన్నవింపదలంచుచుంటిమి', యని మా గోడు ఆయనకు వినిపించి, నొక విన్నపము వ్రాసి పెట్టమంటిమి.

ఆయన పలు అభ్యంతరములు లేవదీసి తాత్సారము జేయ, మేము విసుగుజెంది, మేము జెప్పినది చెప్పినట్లు వ్రాయక పిచ్చి పిచ్చి వేషములు వేసినచో కొమ్ములతో బొడిచి వేయుదుమని సవినయముగా హెచ్చరింప, మా హెచ్చరిక నిర్లక్ష్యము జేయ సాహసించక, కలము, కాగితము తీసి తనచేత వెట్టి చాకిరి

చేయించుచున్నారని నిందించుచూ, రోదించుచూ వ్రాయదొడంగిరి.

అయ్యలారా! మేము పశువులమైనను లోకజ్ఞానము లేనివారముగాము. మాలో కొందరము గ్రామ పాఠశాలలో నివాసమేర్పరుచుకుని, భావి భారత పౌరులకు గవర్నమెంటు వారు ఉచితముగనిచ్చు విద్యాబుద్ధులు నేర్చితిమి. మరికొందరము ప్రైవేటు కాలేజీ పాకలలో మసులుచూ ఉన్నత విద్యగూడ నభ్యసించితిమి. అదియునుగాక, పంచాయితీ ఆఫీసు ఆవరణలోనూ, రచ్చబండ మీదను జరుగు చర్చలు, సోదర రాజకీయ నాయకుల ఉపన్యాసములు వినుచు మా విషయ పరిజ్ఞానము వృద్ధి చేసుకుంటిమి.

పౌరులారా! మాకు జరిగిన ఘోర అన్యాయము గురించి మీరు ఆకాశవాణి, దూరదర్శనుల ద్వారా తెలిసికొనియేయుందురు. వార్తాపత్రికలలో గూడ చదివియేయుందురు. చర్విత చర్వణమే అయినను, మీలో తెలియని వారు ఎవరైనను ఉండవచ్చునన్న సందేహముతో మా గోడు మరల ఈ దిగువన వివరించుచున్నాము.

కేంద్ర ప్రభుత్వము మా గ్రాసము నిమిత్తము, సాలునకు అయిదువందల కోట్ల (అక్షరాలా అయిదువందల కోట్లు) రూపాయలు రాష్ట్ర ప్రభుత్వమునకు ఇచ్చుచున్న దనియు, రాష్ట్ర ప్రభుత్వము మరొక అయిదు వందల కోట్ల (అక్షరాలా అయిదు వందల కోట్లు) రూపాయలు ఇందునిమిత్తమై ఖర్చు పెట్టుచున్నదనియు, అనగా సాలునకు వెయ్యి కోట్ల (అక్షరాలా వెయ్యికోట్లు) రూపాయలు మా గ్రాసము నిమిత్తము ప్రభుత్వము ప్రత్యక్ష ముగా గాని, పరోక్షముగ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారాగాని ఖర్చు పెట్టవలసి యుండ, ఆశ్చర్యకరముగ ఇందులో గడ్డిపరకయైనను మాకు చేరలేదనియు, ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు, నోరులేని మా నోటి దగ్గర గడ్డి తినివేసిరనియు, తమకు బాగుగా తెలిసిన విషయమే అయినను, మరియొకసారి తమ దృష్టికి తీసుకురా సాహసిం చుచుంటిమి. ఇన్ని సంవత్సరముల నుంచి ఇది ఎటుల జరుగుచున్నదో మా గేదె బుర్ర లకు అర్థమగుటలేదు.

అందువిషయమై ప్రభుత్వ సేవలో మూడు దశాబ్దములు వెలగబెట్టిన అనుభవజ్ఞులు శ్రీ జగన్మోహనరావుగారిని యడుగగా, ఆయన తెలివి తేటలు గూడ మా లెవెలు లోనే యుండుట చేతనో, లేక ఆయన స్వయముగా రాజోద్యోగి అయియుండి, గడ్డి తినుట ఉద్యోగుల జన్మ హక్కుయని భావించుటచేతనో, ఈ విషయము స్పష్టబరచరైరి. పై పెచ్చు, ఒక ప్రక్క వాములు వాములు మాయమగుచుండ, నాలుగు గడ్డి పరకల గురించి ఇంత గింజుకొనుచున్నారే! ఇది నలుగురి దృష్టికి తీసుకురావలసినంతటి ముఖ్య విషయమా? నా శిరము! అని విసుగుకొనిరి.

లక్షల ప్రాణముల జీవన్మరణ సమస్య నాలుగు గడ్డిపరకలగునా యని చింతించి, ఇన్ని గవర్నమెంటు రూల్సు యుండగా, ఇంత పెద్దఎత్తున, ఇంత కాలము ఈ కుంభకోణమెట్లు జరిగెను యని యడుగగా, శ్రీ జగన్మోహనరావు, 'రూల్సు అసమర్థుల వీపుమీద రూళ్ళ కర్రవలె నాట్యము చేయును, సమర్థులు రూల్సు నడుము విరుగగొట్టుదురు....ఇదియును తెలియదా?' యని హేళన జేసిరి.

తినుటకు గడ్డి లేకపోయినచో మేమెట్లు పాలిత్తుము యని యడుగగా, తినుటకు గడ్డి లేకపోయినచో మంత్రులు మాత్రము ఎట్లు పాలిత్తురు? యని ఆయన ఎదురు ప్రశ్న వేసిరి.

ఓటరు మహాశయులారా! గడ్డి తినుటయే పాలించుటకు అర్హతయని మీరు భావించుచున్నచో, మా కంటె అర్హులెవరూ నుండబోరన్న సత్యము మీ అమూల్యమైన ఓటును వినియోగించు సమయమున మదిలోనుంచుకొనవలయునని కోరుచున్నాము.

కంచెయే చేను మేయుచుండ, మా విన్నపము ఎవరికి జేయవలెనాయని యోచించుచుండ, ఈ విషయము విచారించుటకు పార్లమెంటరీ కమిటీ నొకదానిని నియమింపగోరమని మేము అడుగకుండనే శ్రీ జగన్మోహనరావు యొక వెధవ సూచన జేసిరి. మేము ఎంత దున్నపోతులమైనను ఎంక్వయిరీ కమిటీలు ఎటుల పని చేయునో తెలియని యజ్ఞానులముగాము. ప్రభుత్వము కోరినదే తడవుగ, ఆనందముగ కమిటీలు నియమించును. ఆ కమిటీలలోని అధికారపక్ష, ప్రతిపక్ష సభ్యులు బావమరుదుల వలె సరస సల్లాపములాడుచూ, దూషించుకొనుచూ 'బయటకు నడుచుచూ' లోనికి వచ్చుచూ, సంవత్సరముల తరబడి విచారింతురు. వాటి నివేదికలు నేలమాళిగలలోనికి బోవును. సత్యము సమాధియగును. 'ఈ కమిటీలలో మాకు విశ్వాసము లేదు. మీ బోడి సలహాలు మీవద్దనే యుంచుకొనుడని' ఆయనకు గట్టిగాజెప్పి, న్యాయస్థానములకు బోదలచితిమి.

శ్రీ జగన్మోహనరావు లా యనగ గాడిద యనియు, ధనముగలవారు గాడిదనెక్కి వీర విహారము సలుపుచుండ, పేదలు న్యాయమునకు మూల్యము చెల్లింప లేక స్వల్ప అపరాధములు చేసినను, నిరపరాధులయినను, కారాగారములలో నశించి పోవుదురు. అదియునుగాక లా బలవంతుల విషయములో నత్తనడక నడుచును. ఎందరో అయిదు నక్షత్రముల నేరస్తులు దశాబ్దములు గడిచినను శిక్షపడకపోగా, వివిధ పదవుల నలం కరించి, ఇంద్రభోగములననుభించుచుండుట మీ గేదె కన్నులకు కనిపించుటలేదే యని వెక్కిరించి, బుద్ధిమంతులైన తనవంటి మనుషులు, వందలాది కుంభకోణములలో వేల కోట్లు స్వాహా చేసిన నేరస్తులు, కొంతకాలము కారాగారము యనబడు నర్సింగ్ హోములలో విశ్రమించి, నిపుణుల పర్యవేక్షణలో శక్తియుక్తులు పుంజుకొని, దేశము మీద మరలబడి తినుచుండుట గుర్తించి, నిర్లిప్తత వహించియుండ, మా బుద్ధిహీనతకు బుజువుగా న్యాయస్థానములకు బోవు చున్నామని మందలించి, 'అయినను న్యాయము గొనుటకు మీ వద్ద ఏమియున్నది' యని పరిహసించిరి.

న్యాయము గాలిలాగ, నీటిలాగ అందరికీ అందుబాటులో నుండవలసినది గాని వ్యాపార వస్తువా? యని మేము తెల్లబోయి, 'న్యాయము గొనుటయేమి? ప్రభుత్వము పేదలకు ఉచిత న్యాయ సహాయము జేయును గదా?' యనగా ప్రభుత్వము పేదలకు ఉచిత వైద్య సహాయము గూడ జేయును, ఎప్పుడైనను ప్రభుత్వ ఆసుపత్రికి బోయి వచ్చితిరా' యని ఆయన వెటకారముగా యడిగిరి.

మాలో ప్రభుత్వ ఆసుపత్రికి బోయిన వారు కలరు కాని వారు తిరిగి వచ్చుట సంభవించలేదు. మా మౌనము చూసి ఆయన, క్వాలిటీ న్యాయము - క్వాలిటీ చదువు, క్వాలిటీ వైద్యము, క్వాలిటీ జీవితముల వలె ఖరీదైనదనియు, అది క్వాలిటీ మనుషులకే గాని పేదయనెడు పచ్చ బంగారము తప్ప కాసులేనివారికి లభించ దనియు వాక్రుచ్చిరి.

ఇది యన్యాయము గాదా యనగా, ఆయన మార్కెట్ శక్తుల గురించి నొక గంట బోరి, ఇది యధర్మముగావచ్చును గాని యన్యాయముగాదనిరి. 'ధర్మము గానిది న్యాయ మెట్లగును? ధర్మము న్యాయము నొకటి గావా?'యని యడుగగా, 'ఒకటి గావు - నలుగురికీ మేలు చేయునది ధర్మము, న్యాయస్థానములు నిలబెట్టు నది న్యాయము' యని జెప్పిరి. అదెట్లన, కోట్ల మంది కూటికి లేక అల్లాడిపోవుచుండ, కోట్లు ఖర్చు పెట్టి మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించుటయు, ఛార్టర్డ్ విమానములలో వివాహమాడి అంత రిక్షమున హనీమూన్ జరుపుకొనుటయు యధర్మముగా వచ్చును గాని యన్యాయము గాదనిరి, అట్లే కూడూ నీడా లేనివారు తిరుగబడుట యధర్మముగాక పోవచ్చును గాని చట్టరీత్యా నేరమై, ఉరికంబములకు దారి తీయు నంటిరి.

మేము న్యాయము జేయవలెనని యడుగవలెనో, ధర్మము కొరకు పోరాడవలెనో మాకు యర్థమగుటలేదు. మా కండ్లకు పరిస్థితియంతయు భీతావహముగ నగు పడు చున్నది. ప్రభుత్వ యంత్రాంగము గ్రీజు వేయనిచో నడువననుచున్నది. ప్రజా ప్రతినిధుల కంచె చేను మేయుచున్నది. న్యాయము ప్రియమై అందుబాటులో లేకున్నది. ప్రజ మా వలె దిక్కు తోచకయున్నది. మరి మాగోడు ఆలకించువారు ఎవరు? యనగా, శ్రీ జగన్మో హనరావు రెండు చేతులు పైకెత్తి , 'వాడు' యని ఆకాశము వైపు చూపిరి.

'పరలోకము జేరిన పిదప ఎటులను వానికి విన్నవింతుము, ఇపుడు ఇహలోకము గురించి ఆలోచించుచుంటిమి' యని ఏమి చేయుటకు తోచక, తోకలెత్తి బుర్రలు కొట్టు కొనుచుండ, దీర్ఘ శృంగుడు, 'ఏ దేశమునందైనను, ఏకాలమునందైనను, మేధావులు గౌరవనీయులు. వారికి మా గోడు వినిపింపుము. వారు విషయమును జక్కగ నర్థము జేసి కొనగల సమర్థులైయుండి జాతికి దారిచూపుదురు, యనగా శ్రీ జగన్మోహనరావు, 'ఎచటకు? ఏటిలోనికా?' యని బెక బెక నవ్వి, 'దేశమున దిగుమతి యగు విలాస వస్తువులపై విదేశీ కంపెనీలు డిమాండు చేసినట్లు ప్రభుత్వము సుంకము తగ్గించుచుండ, దివాలా తీసిన బొక్కసము నింపుటకు మద్యపానము ప్రోత్సహించవలెననియు, విద్యా వైద్యములమీది ఖర్చు తగ్గించవలయునియు, ప్రముఖ మేధావులు ప్రభుత్వమునకిచ్చెడి అమూల్య సూచనలు మీ చెవులబడలేదా? అయినను, నూతన ఆర్థిక విధానములలో ఉన్నత వర్గమునకు చెందిన మేధావులకు వారి మేధకు తగ్గ మూల్యము లభించుచూ, వారి జీవితము మూడు కెంటుకీ ఫ్రైడ్ చికెనులు, ఆరు పెప్సీల వలె నుండ, ఎచటనో, ఎవరికో, ఏదియో అన్యాయము జరుగుచున్నదని వారెందుకు తమ అమూల్య

కాలమును వృథా చేసికొనెదరు?' యని విసుగుకొనిరి.

'దేశవాసులారా! దిక్కుతోచని ఇటువంటి స్థితిలో మీయందరకును ఈ విజ్ఞప్తి జేయుచుంటిమి!

ప్రజలారా! స్వాతంత్ర్యము మా జన్మహక్కని నినదించుచూ మీరు ఉరికంబములు ఎక్కితిరి. కారాగారములలో నశించిపోతిరి. ధనమానప్రాణహానులకు లెక్కజేయక, నలుగురికి మేలుజేయు నొక రామరాజ్యము రాగలదన్న ఆశతో పోరు సలిపితిరి. దగాపడిన తమ్ములారా! మీరందరూ అనేక కష్టనష్టములకోర్చి సంపాదించిన ఈ స్వాతంత్ర్యము అందరి సొత్తైనయి జనులందరూ అనుభవింపవలసియుండ, మాయోపాయము జేసి మీ త్యాగఫలము కొందరు వంచకులు చేజిక్కించుకొనిరని గుర్తించినను, నిలదీసి యడుగక, ఇటుల నిర్లిప్తత వహించుట తగునా? భారత దేశము వదలి పొండు యనుచు గర్జించి ఆంగ్ల సింహముతో కలబడి పోరాడినది దేశమును ఈ నక్కల పాలు జేయుటకేనా? యోచింపుడు.

చీమకైను, పాముకైనను హాని తలపెట్టక, సమదృష్టితో జూచు సహృదయులారా! శాంతి ప్రియులారా! దౌష్ట్యము, వంచనల ముందు తలవంచి యార్జించిన శాంతి మరింత యశాంతికి దారితీయుననియు, అధర్మము, శాంతి, సహజీవనము జేయుట అసంభవ మనియు, అధర్మ నిర్మూలనమే సుస్థిరము, సత్యమునగు శాంతికి దారితీయుననియు గుర్తించి, మీరందరూ యాలోచన చేసి, ఈ రాజ్యమున ధర్మము నిలబెట్ట వలసినదని, సవినయముగా కొమ్ములు మీ పాదములకు తాకునట్లు శిరము వంచి ప్రార్థించు చున్నాము.

వివిధ రంగములలో అత్యున్నత స్థానములనలంకరించి, జాతి జీవనము నిర్దేశించు మేధావులారా! అధర్మము పెచ్చురిల్లి, ధర్మ దేవత కొన ప్రాణముతో నున్న ఈ తరుణమున మీరు యధర్మ పక్షము జేరి, కాకులను గొట్టి గ్రద్దలకు వేయు ప్రణాళికలు రచియించుట గాని, లేక తటస్థులుగా నుండుటగాని శ్రేయస్కరము గాదు. ధర్మము నకు యధర్మమునకు సంఘర్షణ జరుగుచున్నప్పుడు తటస్థులుగ నుండు వారు నిజ ముగ తటస్థులుగారనియు, వారు యధర్మపక్షమునే యుందురనియు నీతి కోవిదులు చెప్పుదురు. మరియు, ధర్మహానిజరుగునప్పుడు ఆపగల సమర్థులు ఉపేక్ష వహించినచో ఆ పాపము వారిని గూడ జుట్టుకొనుననియు, వారు గూడ ప్రాయశ్చిత్తము జేయవలసి యుండుననియు, ధర్మశాస్త్రములు హెచ్చరించుచుండుట మరువకుడు!

నయవినయ ప్రణామాల వల్లకీలెక్కిన నహుషులారా! మీరు పదవుల కొరకు కుక్కల వలె కొట్లాడుచూ కులమత ప్రాంత భాషా విద్వేషములు రెచ్చగొట్టి మీ స్వార్థమునకు అసంఖ్యాక అమాయక ప్రాణములు బలిపెట్టుచూ, ఈ ఏబదిఏండ్లూ నిర్భయముగా, ఘరానా దొంగలవలె దేశమును కొల్లగొట్టితిరి, కుక్కలు చింపిన విస్తరిజేసితిరి, నాలుగు డాలరుల కొరకు అంతర్జాతీయ విపణిలో అందరి సొత్తూ అయిన ఈ స్వాతంత్ర్యమును మీయబ్బ సొమ్మువలె నిర్లజ్జగా తాకట్టు పెట్టుటకు

గూడ సందేహించకుంటిరి. తల్లినైనను తార్చుటకు వెనుదీయని తుచ్ఛులారా! ప్రజ మూడవ కన్ను తెరిచి లెక్కలడుగు సమయమున, మీ కావలి కుక్కలు గాని, మీ చట్టముల కవచములు గాని, ఏవియును మిమ్ములను కాపాడలేవని తెలుసుకొనుడు! ఇటువంటి బందిపోట్ల రాజ్యములు ఎటుల ఉరితీయబడినవో చరిత్రనొకసారి తిరగవేయుడు!

మీమీ బంగారు కలుగులలో, సుఖశాంతులతో, ఐశ్వర్యానందములతో విలాసముగ జీవించుచున్న లక్ష్మీపుత్రులారా! మా క్షేమము మీకెటులను బట్టునట్లు లేదు గనుక, మీ క్షేమము దృష్టిలోనుంచికొనియైనను, మీ స్వప్నలోకముల నుండి దిగివచ్చి, కాష్ఠమువలె కాలుచున్న దేశము నొకసారి తిలకించుడు. మేము చెప్పునది ఒడలు దగ్గరయుంచుకుని వినుడు. మీరు మసులుచున్న అయిదునక్షత్రముల స్వర్గము క్రింద నొక యగ్ని పర్వతము రగులుచున్నది. నేలకు చెవి యొగ్గి యున్న మాకు, భూగర్భ నుండి వచ్చు చున్న రణగొణధ్వనులు - రాబోవు విస్ఫోటనపు సంకేతములు - స్పష్టముగా వినవచ్చు చున్నవి. మూర్ఖులారా! ఆ అగ్నిపర్వతము ఫెళ ఫెళారావములతో భయంకరముగా విస్ఫోటనము జెంది, ఆ ప్రళయజ్వాలలో మీరు శలభముల వలె మాడి నశించి పోకమునుపే మేల్కొనుడు. అది మీకును, మాకును, అందరకును క్షేమమగును.

ఇది నిస్సహాయుల, బలహీనుల, ఆక్రందనగా త్రోసిపుచ్చెడి దుస్సాహసము జేయవలదు. ఏలయన, మాకు పాలనిచ్చు పొదుగులతో పాటు, అధర్మము గుండెలు చీల్చగల కొమ్ములు గూడ యున్నవి. పై ప్రయత్నములు విఫలమైనచో ఆ కొమ్ములు ఉపయోగించుటకు మేము వెనుదీయమని హెచ్చరించుచూ -

ఇట్లు తమ విధేయులు
(అసంఖ్యాక మూగజీవముల తరపున పంధొమ్మిది గేదెలు, రెండు
దున్నపోతులు తోకముద్రలు వేయడమైనది)

గమనిక:ఈ విజ్ఞప్తి పకోడీలు పొట్లము కట్టుటకే ఉపయోగపడుననియు, ఎవరును జదువరనియు, ఇదియంతయు వృధాకాలయాపనయనియు, ఎంత నచ్చజెప్పినను వినక, నన్ను బెదిరించి, తోకముద్రదారులు నా చేత బలవంతముగ వ్రాయించితిరని చదువరులు గ్రహింతురుగాక! వారు నా గురించి చేసిన అప్రస్తుత, అభ్యంతరకర వ్యాఖ్యలతో సహా, వారు చెప్పినది చెప్పినట్లు, యథాతథముగ వ్రాసితినని చదువరులు గ్రహించి, లేఖకునకు తోకముద్రదారులు మనసులో అనుకున్నదీ, వారిలోవారు సంభా షించినదీ, ఎట్లు తెలిసినది యను చొప్పదంటు ప్రశ్నలు వేయకుందురుగాక!

తోలేటి జగన్మోహనరావు వ్రాలు

***

(ఆదివారం ఆంధ్రజ్యోతి , 16 ఆగష్టు ,1998)